**199వ అధ్యాయం**

# ١٩٩ - بَابُ سُنَّةِ الظُّهْرِ

# జుహ్రాకు సంబంధించిన సున్నత్‌లు

١١١٣ - عَنِ ابنِ عُمَرَ رَضِيَ اللهُ عَنْهُمَا قالَ: صَلَّيْتُ مَعَ رسولِ اللهِ ﷺ رَكْعَتَيْنِ قَبْلَ الظُّهْرِ، وَرَكْعَتَيْنِ بَعْدَهَا. متفقٌ عليه.

1113. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: నేను దైవప్రవక్త (సల్లం) వెంట జుహ్రా (వేళ, ఫర్జ్ నమాజు) కు ముందు రెండు రకాతులు, దాని తర్వాత రెండు రకాతులు నమాజ్ చేశాను.

*(బుఖారీ-ముస్లిం)*

١١١٤ - وَعَنْ عَائِشَةَ رَضِيَ اللهُ عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ كانَ لا يَدَعُ أَرْبَعاً قَبْلَ الظُّهْرِ. رَواه البخاريُّ.

1114. హజ్రత్ ఆయిషా (రజి.అన్హా) కథనం: దైవప్రవక్త (సల్లం) జుహ్రాకు ముందు నాలుగు రకాతులను ఎన్నడూ వదలిపెట్టేవారు కారు.

*(బుఖారీ)*

*(సహీహ్ బుఖారీలోని తహజ్జుద్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

కొన్ని ఉల్లేఖనాల్లో జుహ్రాకు ముందు రెండు రకాతులు దాని తర్వాత రెండు రకాతులు చేయాలని చెప్పబడింది. ఈ హదీసులోనేమో జుహ్రాకు ముందు నాలుగు రకాతులున్నాయని వివరించబడింది. ఈ రెండు సంఖ్యలూ సరైనవే. పరిస్థితుల కనుగుణంగా రెండింట్లో ఏ హదీసునయినా ఆచరించవచ్చు.

١١١٥ - وَعَنْهَا قَالَتْ: كَانَ النبيُّ ﷺ يُصَلِّي في بَيْتِي قَبْلَ الظُّهْرِ أَرْبَعاً، ثُمَّ يَخْرُجُ، فَيُصَلِّي بِالنَّاسِ، ثُمَّ يَدْخُلُ فَيُصَلِّي رَكْعَتَيْنِ، وَكانَ يُصَلِّي بِالنَّاسِ المَغْرِبَ، ثُمَّ يَدْخُلُ فَيُصَلِّي رَكْعَتَيْنِ،

1115. హజ్రత్ ఆయిషా (రజి.అన్హా) గారే చేసిన కథనం: దైవప్రవక్త (సల్లం) జుహ్రా వేళ ఫర్జ్ నమాజుకు ముందు నా ఇంట్లో నాలుగు రకాతులు చేసేవారు. తర్వాత బయటికి వెళ్ళి ప్రజలకు నమాజ్ చేయించేవారు. ఆ

وَيُصَلِّي بِالنَّاسِ العِشَاءَ، وَيَدْخُلُ بَيْتِي، فَيُصَلِّي رَكْعَتَيْنِ. رواه مسلم.

తర్వాత ఇంటికి వచ్చి రెండు రకాతులు చేసేవారు. అదే విధంగా ప్రజలకు మగ్రిబ్ నమాజు చేయించేవారు. తర్వాత ఇంటికి వచ్చి రెండు రకాతులు చేసేవారు. అలాగే ప్రజలకు ఇషా నమాజు చేయించి, ఇంటికి తిరిగొచ్చిన తర్వాత రెండు రకాతులు చేసేవారు. (ముస్లిం)

(సహీహ్ ముస్లింలోని ప్రయాణీకుల నమాజ్ ప్రకరణం)

١١١٦ - وعن أُمِّ حَبِيبَةَ رَضِيَ اللهُ عَنْهَا قَالَتْ: قَالَ رسولُ اللهِ ﷺ: «مَنْ حَافَظَ عَلَى أَرْبَعِ رَكَعَاتٍ قَبْلَ الظُّهْرِ، وَأَرْبَعٍ بَعْدَهَا، حَرَّمَهُ اللهُ عَلَى النَّارِ». رواه أبو داود، والترمذي وقال: حديثٌ حسنٌ صحيحٌ.

1116. హజ్రత్ ఉమ్మె హబీబా (రజి.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: జుహ్రాకు ముందు నాలుగు రకాతుల్ని, దాని తర్వాత నాలుగు రకాతుల్ని క్రమం తప్పకుండా చేసేవారి కొరకు దేవుడు నరకాగ్నిని నిషిద్ధం చేస్తాడు. (అబూ దావూద్, తిర్మిజీలు దీనిని ఉల్లేఖించారు: తిర్మిజీ దీనిని హసన్ మరియు సహీహ్‌గా పేర్కొన్నారు)

(సుననె అబూదావూద్, సుననె తిర్మిజీలలోని ప్రయాణీకుల నమాజ్ ప్రకరణం)

## ముఖ్యాంశాలు

నరకాగ్నిని నిషిద్ధం చేయటమంటే ఇస్లాం స్థితిలోనే వారికి మరణం సంభవిస్తుందని భావం. కనుక అలాంటివారు అవిశ్వాసుల మాదిరిగా శాశ్వతంగా నరకంలో ఉండాల్సిన అవసరం లేదు. అదే విధంగా కొన్ని హదీసుల్లో నరకాగ్ని వారిని అంటుకొనజాలదు అని వస్తుంది. దాని భావం కూడా అదే. అంటే శాశ్వత నరకం వారిని అంటుకొనజాలదన్నమాట!

ఒకవేళ ముస్లిం వ్యక్తి గనక పాపాత్ముడయి, శిక్షార్హుడయి ఉంటే అతను కూడా కొంతకాలంపాటు నరకంలో శిక్షననుభవించాల్సిందే! ఆ విధంగా ముస్లింల నరక ప్రవేశం సదరు హదీసులాంటి హదీసుల భావాలకు విరుద్ధమూ కాదు. ఎందుకంటే ముస్లింలు అంతిమంగా నరకం నుండి బయటికి తీయబడి స్వర్గానికి పంపబడతారు. ముస్లింలు

నరకంలో ఎల్లకాలం ఉండరు. అయితే ముస్లింలు ఏం చేసినా అసలు వారికి నరక శిక్షే ఉండదని భావించటం కూడా తగదు. దేవుడు గనక వారిని ప్రారంభంలో క్షమించకపోతే, ఆయన తలచినంత కాలం నరకంలో మాడిచావాల్సిందే. ఆ తర్వాతే వారికి స్వర్గభాగ్యం లభిస్తుంది.

١١١٧ ـ وَعَنْ عبدِ اللهِ بنِ السائبِ رَضِيَ اللهُ عَنْهُ، أَنَّ رسولَ اللهِ ﷺ كانَ يُصَلِّي أَرْبعاً بَعْدَ أَنْ تَزولَ الشَّمْسُ قَبْلَ الظُّهْرِ، وقالَ: «إِنَّهَا سَاعَةٌ تُفْتَحُ فِيهَا أَبوابُ السَّمَاءِ، فَأُحِبُّ أَنْ يَصْعَدَ لِي فِيهَا عَمَلٌ صَالِحٌ» رواه الترمذي وَقالَ: حديثٌ حسنٌ.

1117. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ సాయిబ్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) సూర్యుడు నడినెత్తి నుండి క్రిందికి వాలిన తర్వాత జుహ్ర్ నమాజుకు ముందు నాలుగు రకాతులు చేసే వారు. ఇంకా ఇలా అనేవారు: "ఇది ఎలాంటి సమయమంటే ఇందులో ఆకాశ ద్వారాలు తెరుచుకుంటాయి. కనుక ఈ ఘడియలో నా సదాచరణలు పైకి వెళ్ళటాన్ని నేను యిష్టపడతాను." (తిర్మిజీ-హసన్)

*(సుననె తిర్మిజీలోని నమాజ్ అధ్యాయం)*

## ముఖ్యాంశాలు

సూర్యుడు నడినెత్తి నుండి వాలగానే జుహ్ర్ నమాజ్ వేళ ప్రారంభమవుతుంది. దీని ద్వారా దైవప్రవక్త (సల్లం) జుహ్ర్‌కు సంబంధించిన నాలుగు రకాతుల సున్నత్ నమాజును తొలివేళలో చేసేవారని అర్థమవుతోంది. అదీగాక దైవప్రవక్త (సల్లం) ఒక్క ఇషా నమాజు మినహా మిగతా నమాజులన్నిటిని తొలివేళలోనే నెరవేర్చేవారు. ఆకాశ ద్వారాలు తెరుచుకుంటా యంటే ఆ సమయంలో మానవుల ఆచరణలు దైవసన్నిధికి గొనిపోబడతాయని భావం.

١١١٨ ـ وَعَنْ عَائِشَةَ رَضِيَ اللهُ عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ إذا لَمْ يُصَلِّ أَرْبعاً قَبْلَ الظُّهْرِ، صَلاَّهُنَّ بَعْدَهَا. رَوَاهُ الترمذي وَقالَ: حديثٌ حَسَنٌ.

1118. హజ్రత్ ఆయిషా (రజి.అన్హా) కథనం: దైవప్రవక్త (సల్లం) ఎప్పుడైనా జుహ్ర్‌కు ముందు నాలుగు రకాతులు చేయలేకపోతే జుహ్ర్ తర్వాత వాటిని నెరవేర్చేవారు. (తిర్మిజీ-హసన్)

*(సుననె తిర్మిజీలోని నమాజ్ ప్రకరణం)*